15. పదునైదవ సర్గము

రావణసంహారమునకై దేవతలు విష్ణువును ప్రార్థించుట.

మేధావీ తు తతో ధ్యాత్వా స కించిదిదముత్తరమ్।
లబ్ధసంజ్ఞః తత స్తం తు వేదజ్ఞో నృపమబ్రవీత్। 1

ప్రజ్ఞావంతుడును, అధర్వణాదివేదములయందు పండితుడును ఐన ఋశ్యశృంగమహర్షి దశరథునకు మాట ఇచ్చిన పిమ్మట తనభావికార్యమునుగూర్చి ఒక్క క్షణమాలోచించెను. పిదప కర్తవ్యము స్ఫురింపగా ఆయన ఆ మహారాజునకు ఇట్లు ప్రత్యుత్తరమునిచ్చెను. (1)

ఇష్టిం తేஉహం కరిష్యామి పుత్రీయాం పుత్రకారణాత్।
అథర్వశిరసి ప్రోక్తై: మంత్రై స్సిద్ధాం విధానత:। 2

తత: ప్రాక్రమదిష్టిం తాం పుత్రీయాం పుత్రకారణాత్।
జుహావ చాగ్నౌ తేజస్వీ మంత్రదృష్టేన కర్మణా। 3

తతో దేవా స్సగంధర్వా: సిద్ధాశ్చ పరమర్షయ:।
భాగప్రతిగ్రహార్థం వై సమవేతా యథావిధి। 4

తాస్సమేత్య యథాన్యాయం తస్మిన్ సదసి దేవతా:।
అబ్రువన్ లోకకర్తారం బ్రహ్మాణం వచనం మహత్। 5

భగవన్ త్వత్ప్రసాదేన రావణోనామ రాక్షస:।
సర్వాన్ నో బాధతే వీర్యాత్ శాసితుం తం న శక్నుమ:। 6

త్వయా తస్మై వరో దత్త: ప్రీతేన భగవన్ పురా।
మానయంతశ్చ తం నిత్యం సర్వం తస్య క్షమామహే। 7

ఉద్వేజయతి లోకాం స్త్రీన్ ఉచ్ఛ్రితాన్ ద్వేష్టి దుర్మతి:।
శక్రం త్రిదశరాజానం ప్రధర్షయితుమిచ్ఛతి। 8

ఋషీన్ యక్షాన్ సగంధర్వాన్ అసురాన్ బ్రాహ్మణాం స్తథా।
అతిక్రామతి దుర్ధర్షో వరదానేన మోహిత:। 9

నైనం సూర్య: ప్రతపతి పార్శ్వే వాతి న మారుత:।
చలోర్మిమాలీ తం దృష్ట్వా సముద్రోஉపి న కంపతే। 10

తన్మహన్నో భయం తస్మాత్ రాక్షసాద్ఘోరదర్శనాత్।
వధార్థం తస్య భగవన్నుపాయం కర్తుమర్హసి। 11

ఏవముక్త స్సురై స్సర్వై: చింతయిత్వా తతోஉబ్రవీత్।
హంతాయం విదితస్తస్య వధోపాయో దురాత్మన:। 12

తేన గంధర్వయక్షాణాం దేవదానవరక్షసామ్।
అవధ్యోஉస్మీతి వాగుక్తా తథేత్యుక్తం చ తన్మయా। 13

"ఓ రాజా! నీకు పుత్రులు కలుగుటకై 'అథర్వశిరస్సు' అను వేదభాగమునందు పేర్కొనబడిన మంత్రములతో విధ్యుక్తముగా 'పుత్రకామేష్టి' అను క్రతువును నిర్వహించెదను." (2)

అనంతరము ఆ ఋషి 'పుత్రకామేష్టి' యాగమును ప్రారంభించెను. ఆ తేజశ్శాలి వేదమంత్రములను పఠించుచు అగ్నికి ఆహుతులను సమర్పించెను. (3)

పిమ్మట బ్రహ్మాదిదేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు తమతమ హవిర్భాగములను గ్రహించుటకై యథాక్రమముగా యజ్ఞశాలయందు ప్రత్యక్షమైరి. (4)

దేవతలు అందఱును క్రమముగా సదస్సునకు చేరి, సృష్టికర్తయైన బ్రహ్మదేవునితో ఇట్లు విన్నవించుకొనిరి. (5)

ఓ దేవా! నీవు అనుగ్రహించిన వరప్రభావమున రావణుడు అను రాక్షసుడు తనపరాక్రమముచే మమ్ములను చిత్రహింసలపాలు చేయుచున్నాడు. అతనిని అదుపుచేయుటకు మేము అశక్తులము, హే భగవన్! పూర్వము అతనితపస్సునకు మెచ్చి, నీవు ఆయనకు వరమును ప్రసాదించితివి. దానిని గౌరవించుచు అతడొనర్చు దుండగములను అన్నింటిని మేము ఓర్చుకొనుచున్నాము. ఆ దుర్మార్గుడు వరగర్వముతో ముల్లోకములను బాధించుచున్నాడు. ఉన్నతులైన దిక్పాలురను ద్వేషించుచున్నాడు. స్వర్గాధిపతియైన ఇంద్రునిసైతము రాజ్యభ్రష్టుని గావింపజూచుచున్నాడు. అతడు వరగర్వితుడై కన్నుమిన్ను గానక ఎదురులేనివాడై ఋషులను, యక్షులను, గంధర్వులను, అసురులను, అట్లే బ్రాహ్మణులను మిక్కిలి హింసించుచున్నాడు. (6-9)

రావణుడు క్రీడాపర్వతమున విహరించునపుడు ఆతనికి భయపడి, సూర్యుడు తనకిరణములవేడిని తగ్గించుచున్నాడు. వాయువుగూడ భయముతో ఆతనిసమీపమున తీవ్రముగా వీచుటలేదు. ఉవ్వెత్తుతరంగములతోనుండు సముద్రుడు అతనికి భయపడి చలించుట లేదు - ఓ మహాత్మా! భయంకరాకారుడైన ఆరాక్షసునకు భీతిల్లి, మేము గడగడలాడు చున్నాము. కావున వానిని హతమొనర్చునుపాయమును మీరే ఆలోచింపుడు." (10-11)

దేవతలు తనను ఇట్లు ప్రార్థింపగా బ్రహ్మదేవుడు కొంత తడవు ఆలోచించి వారితో ఇట్లనెను. "భళా! ఆ దుర్మార్గుని చంపునుపాయము స్ఫురించినది. (12)

"గంధర్వులచేగాని, యక్షులచేగాని, దేవతలచేగాని. దానవులచేగాని, రాక్షసులచేగాని నాకు చావు లేకుండునట్లు వరమిమ్ము." అని రావణుడు అర్థించెను. నేను "అట్లే" అని యంటిని.

వాక్యేర్తయదవజ్ఞానాత్ తద్రక్షో మానుషాంస్తదా।
తస్మాత్ స మానుషాద్వధ్యో మృత్యుర్నాన్యోఽస్య విద్యతే। 14

ఏతచ్ఛ్రుత్వా ప్రియం వాక్యం బ్రహ్మణా సముదాహృతమ్।
సర్వే మహర్షయో దేవాః ప్రహృష్టా స్తేఽభవం స్తదా। 15

ఏతస్మిన్నంతరే విష్ణుః ఉపయాతో మహాద్యుతిః।
శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః। 16

బ్రహ్మణా చ సమాగమ్య తత్ర తస్థౌ సమాహితః।
తమబ్రువన్ సురాః సర్వే సమభిష్టూయ సన్నతాః। 17

త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హితకామ్యయా।
రాజ్ఞో దశరథస్య త్వమ్ అయోధ్యాధిపతేః ప్రభోః। 18

ధర్మజ్ఞస్య వదాన్యస్య మహర్షిసమతేజసః।
తస్య భార్యాసు తిసృషు హ్రీశ్రీకీర్త్యుపమాసు చ। 19

విష్ణో పుత్రత్వ మాగచ్ఛ కృత్వాఽఽత్మానం చతుర్విధమ్।
తత్ర త్వం మానుషో భూత్వా ప్రవృద్ధం లోకకంటకమ్।
అవధ్యం దైవతై ర్విష్ణో సమరే జహి రావణమ్। 20

స హి దేవాంశ్చ గంధర్వాన్ సిద్ధాంశ్చ మునిసత్తమాన్।
రాక్షసో రావణో మూర్ఖో వీర్యోత్సేకేన బాధతే। 21

ఋషయశ్చ తతస్తేన గంధర్వాప్సరసస్తథా।
క్రీడంతో నందనవనే క్రూరేణ కిల హింసితాః। 22

వధార్థం వయ మాయాతాః తస్య వై మునిభిః సహ।
సిద్ధగంధర్వయక్షాశ్చ తత స్త్వాం శరణం గతాః। 23

త్వం గతిః పరమా దేవ సర్వేషాం నః పరంతప।
వధాయ దేవశత్రూణాం నృణాం లోకే మనః కురు। 24

ఏవ ముక్తస్తు దేవేశో విష్ణుస్త్రిదశపుంగవః। 25

పితామహపురోగాం స్తాన్ సర్వలోకనమస్కృతః।
అబ్రవీత్ త్రిదశాన్ సర్వాన్ సమేతాన్ ధర్మసంహితాన్। 26

భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్।
సపుత్రపౌత్రం సామాత్యం సమిత్ర జ్ఞాతి బాంధవమ్।
హత్వా క్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్। 27

ఆ రావణుడు వరమునుకోరెడి సమయమున మనుష్యుల యెడ వానికిగల చులకన భావముచే వారివలన చావు లేకుండునట్లు అడుగలేదు. కావున మానవుని చేతిలోనే అతని మరణము సంభవము - ఇతరులవలన కాదు." (13-14)

బ్రహ్మదేవుడు పలికిన ప్రీతికరమైన ఈ పలుకులను విని, దేవతలు, మహర్షులు అందఱును ఆనందముతో పొంగిపోయిరి.(15)

ఇంతలో జగన్నాథుడైన శ్రీమహావిష్ణువు శంఖచక్ర గదాపాణియై, పీతాంబరధారియై దివ్యతేజస్సుతో విరాజిల్లుచు యజ్ఞశాలకు అరుదెంచెను. (16)

అంతట మహావిష్ణువు బ్రహ్మతోగూడి అచట ఉపస్థితుడాయెను. పిమ్మట దేవతలందఱును ఆదేవదేవుని సంస్తుతించి, సాగిలబడి మ్రొక్కి ఇట్లు ప్రార్థించిరి. (17)

"ఓ మహావిష్ణూ! లోకకల్యాణకాంక్షతో నిన్ను మేము ఇట్లు వేడుకొనుచున్నాము. అయోధ్యాధిపతియైన దశరథమహారాజు సర్వసమర్థుడు, ధర్మజ్ఞుడు, ఉదారస్వభావము గలవాడు, మహర్షితో సమానమైన తేజస్సుగలవాడు, అతని ముగ్గురు భార్యలును దక్షకన్యలైన హ్రీ, శ్రీ, కీర్తి అను వారితో సమానలు. వారికి నాలుగురూపములలో పుత్త్రుడవు కమ్ము. రావణుడు వరప్రభావమున లోకకంటకుడాయెను. అతనిని దేవతలు ఎవ్వరును చంపజాలరు. నీవు మానవుడుగా అవతరించి, యుద్ధమున అతనిని హతమార్చుము (18-20)

రాక్షసుడైన ఆ మూర్ఖరావణుడు పరాక్రమగర్వముతో దేవతలను, గంధర్వులను, సిద్ధులను, మునీశ్వరులను యుక్తాయుక్త విచక్షణ లేకుండ మిక్కిలి బాధించుచున్నాడు. ఆ క్రూరుడు ఋషులను అట్లే నందనవనమున విహరించుచున్న గంధర్వులను, అప్సరసలను హింసించుచున్నాడు. (21-22)

సిద్ధగంధర్వయక్షులును, మేమును మునులతోగూడి ఆక్రూర రావణునిసంహారముకొఱకై ఇచటికి వచ్చి, మిమ్ము శరణు బొందుచున్నాము. ఓ శత్రుభయంకరా! ఓ మహావిష్ణూ! మా అందఱికిని నీవే దిక్కు. కావున దేవతలకు శత్రువులైన రాక్షసులను వధించుటకై మానవుడవై అవతరించుటకు సంకల్పింపుము." (23-24)

బ్రహ్మదిదేవతలు ఇట్లు ప్రార్థింపగా సకలలోకారాధ్యుడు, దేవదేవుడు ఐన ఆ శ్రీమహావిష్ణువు తనను శరణుజొచ్చిన ఆ బ్రహ్మదిదేవతలందఱితో ఇట్లు నుడివెను. (25-26)

"భయమును వీడుడు. మీకు భద్రత చేకూరును. క్రూరుడు, దురాత్ముడు, దేవర్షులను బాధించుచున్న వాడు అగు రావణుని, అతనిపుత్త్రులను, పౌత్త్రులను, అమాత్యులను, బంధువులను,

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ ।
వత్స్యామి మానుషే లోకే పాలయన్ పృథివీ మిమామ్ । 28

ఏవం దత్త్వా వరం దేవో దేవానాం విష్ణు రాత్మవాన్ ।
మానుషే చింతయామాస జన్మభూమిమ్ అథాత్మన: । 29

తత: పద్మపలాశాక్ష: కృత్వాత్మానం చతుర్విధమ్ ।
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్ । 30

తదా దేవర్షిగంధర్వా: సరుద్రా: సాప్సరోగణా: ।
స్తుతిభిర్దివ్యరూపాభి: తుష్టువుర్మధుసూదనమ్ । 31

త ముద్ధతం రావణముగ్రతేజసం
ప్రవృద్ధదర్పం త్రిదశేశ్వరద్విషమ్ ।
విరావణం సాధు తపస్వికంటకం
తపస్వినాముద్ధర తం భయావహమ్ । 32

త మేవ హత్వా సబలం సబాంధవం
విరావణం రావణముగ్రపౌరుషమ్ ।
స్వర్లోకమాగచ్ఛ గతజ్వరశ్చిరం
సురేంద్రగుప్తం గతదోషకల్మషమ్ । 33

మిత్రులను, జ్ఞాతులను అందఱిని లోకహితార్థమై యుద్ధమున హతమార్చితీరెదను. పిమ్మట పదునొకండు వేల సంవత్సరముల కాలము ఈ మానవలోకమున నివసించి ఈ భూమండలమును పరిపాలించెదను." (27-28)

అని, సకల ప్రాణులకును ఆధారమైన దేవదేవుడైన శ్రీమహావిష్ణువు దేవతలకు 'వరమును' అనుగ్రహించి, మానవ లోకమున తాను అవతరింపదగు స్థానమును గూర్చి ఆలోచించెను. (29)

పిమ్మట ఆ రాజీవలోచనుడు తాను దశరథమహారాజునకు నాలుగు రూపములలో పుత్త్రులుగా జన్మించుటకు సంకల్పించెను. (30)

బ్రహ్మరుద్రాదిదేవతలు, ఋషులు, గంధర్వులు, అప్సరసలు దివ్యస్తుతులతో ఆ శ్రీమహావిష్ణువును స్తుతించిరి. (31)

"ఆ రావణుడు సహజముగనే గర్వితుడు, వరప్రభావముచే కన్నుమిన్నుగానక యున్నవాడు, ధర్మవిరుద్ధముగా ప్రతాపమును చూపువాడు, దేవేంద్రునకు శత్రువు, లోకములను బాధించువాడు, సత్పురుషులను, మునులను హింసించువాడు, తాపసులకు భయంకరుడు. అట్టి దుష్టుని సంహరింపుము. (32)

క్రూరరాక్షసుడైన ఆ రావణుని, అతనిబంధు మిత్రులను, సైన్యములను, పరివారములను తుదముట్టించి, ఆర్తుల వెతలను బాపుము. పిదప ఓ దేవదేవా! మా బోటివారికి అందరానిదియు, రాగద్వేషములకు తావులేనిదియు ఐన వైకుంఠమునకు చేరుము." (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచదశస్సర్గ: (15)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదునైదవసర్గము సమాప్తము

-- * * * --

16. పదునాఱవసర్గము

యజ్ఞపురుషునిచే దశరథునకు పాయసప్రదానము, దానిని భుజించి కౌసల్య, సుమిత్ర, కైకేయి గర్భములను దాల్చుట.

తతో నారాయణో దేవో నియుక్త: సురసత్తమై: ।
జానన్నపి సురానేవం శ్లక్ష్ణం వచనమబ్రవీత్ । 1

ఉపాయ: కో వధే తస్య రావణస్య దురాత్మన: ।
యమహం తం సమాస్థాయ నిహన్యామ్ ఋషికంటకమ్ । 2

బ్రహ్మాదిదేవతలు ఇట్లు ప్రార్థింపగా దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణుడు తాను సర్వజ్ఞుడయ్యును వారితో మధురముగా ఇట్లు వచించెను. (1)

"ఓ దేవతలారా! దురాత్ముడైన ఆ రావణుని చంపుటకు ఉపాయమును తెలుపుడు. దానిని అనుసరించి, ఆ ఋషికంటకుని హతమార్చెదను. (2)

ఏవ ముక్తాః సురాః సర్వే ప్రత్యూచుః విష్ణు మవ్యయమ్।
మానుషీం తను మాస్థాయ రావణం జహి సంయుగే। 3

స హి తేపే తపస్తీవ్రం దీర్ఘకాలమ్ అరిందమ।
యేన తుష్టోఽ భవద్బ్రహ్మా లోకకృల్లోకపూర్వజః। 4

సంతుష్టః ప్రదదౌ తస్మై రాక్షసాయ వరం ప్రభుః।
నానావిధేభ్యో భూతేభ్యో భయం నాన్యత్ర మానుషాత్।
అవజ్ఞాతాః పురా తేన వరదానే హి మానవాః। 5

ఏవం పితామహాత్ తస్మాత్ వరం ప్రాప్య స దర్పితః। 6

ఉత్సాదయతి లోకాంస్త్రీన్ స్త్రియశ్చాప్యపకర్షతి।
తస్మాత్ తస్య వధో దృష్టో మానుషేభ్యః పరంతప। 7

ఇత్యేతద్వచనం శ్రుత్వా సురాణాం విష్ణురాత్మవాన్।
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్। 8

స చాప్యపుత్రో నృపతిః తస్మిన్ కాలే మహాద్యుతిః।
అయజత్ పుత్రియా మిష్టిం పుత్రేప్సు రరిసూదనః। 9

స కృత్వా నిశ్చయం విష్ణుః ఆమంత్ర్య చ పితామహమ్।
అంతర్ధానం గతో దేవైః పూజ్యమానో మహర్షిభిః। 10

తతో వై యజమానస్య పావకాదతులప్రభమ్।
ప్రాదుర్భూతం మహద్భూతం మహావీర్యం మహాబలమ్। 11

కృష్ణం రక్తాంబరధరం రక్తాస్యం దుందుభిస్వనమ్।
స్నిగ్ధహర్యక్షతనుజశ్మశ్రుప్రవరమూర్ధజమ్ । 12

శుభలక్షణసంపన్నమ్ దివ్యాభరణభూషితమ్।
శైలశృంగసముత్సేధం దృప్తశార్దూలవిక్రమమ్। 13

దివాకరసమాకారం దీప్తానలశిఖోపమమ్।
తప్తజాంబూనదమయీం రాజతాంతపరిచ్ఛదామ్। 14

నిత్యుడైన శ్రీమహావిష్ణువు యొక్క వచనములకు దేవతలు ఎల్లరును ఇట్లు ప్రత్యుత్తరమిచ్చిరి. "ఓ శత్రుసంహారకా! నీవు మానవుడుగా అవతరించి, యుద్ధమున ఆ రావణుని రూపుమాపుము. పూర్వము అతడు దీర్ఘకాలము తీవ్రముగా తపమొనరించెను. సృష్టికర్తయు, దేవతలలో పెద్దవాడును ఐన బ్రహ్మ వానితపమునకు సంతుష్టుడాయెను. సంతుష్టుడై యున్న బ్రహ్మనుండి 'ఆ రాక్షసుడు' మానవునివలనతప్ప ఏ ఇతరప్రాణినుండియు తనకు మృత్యుభయము లేకుండునట్లు వరమును పొందెను. మానవులయెడ వానికిగల చులకనభావమే అందులకు కారణము. (3-5)

ఈ విధముగా పితామహునివరమువలన గర్వితుడై, ఆ రాక్షసుడు ముల్లోకములను పీడించుచున్నాడు, స్త్రీలను గూడ కించపఱచుచున్నాడు. కావున ఓ అరిసూదనా! మానవుల వలననే అతడు మరణించుట సంభవము. (6-7)

సమస్తప్రాణులకును ఆధారభూతుడైన శ్రీమహావిష్ణువు దేవతల ఈ మాటలను ఆలకించి, దశరథ మహారాజునకు పుత్రుడై జన్మించుటకు నిశ్చయించుకొనెను. (8)

అదే సమయమున మహాపరాక్రమవంతుడు, శత్రుసంహారకుడు ఐన దశరథుడు పుత్రులులేక తపనపడుచుండెను. పుత్రప్రాప్తికై అతడు 'పుత్రకామేష్టి' అను యాగమును ఆచరించెను. (9)

విష్ణుమూర్తి మానవుడుగా అవతరించుటకు నిశ్చయించుకొనెను. పిమ్మట దేవతల, మహర్షుల పూజలను అందుకొని, బ్రహ్మదేవుని వీడ్కొని అంతర్ధానమయ్యెను. (10)

దశరథుని యొక్క ఆ యజ్ఞకుండమునుండి సాటిలేని తేజస్సులతోగూడిన ఒక దివ్యపురుషుడు ప్రత్యక్షమాయెను. అతడు మహాబలపరాక్రమసంపన్నుడు. కృష్ణవర్ణముతో విరాజిల్లుచున్నవాడు. అతడు ఎఱుపు వస్త్రములను ధరించి యుండెను. అతనిముఖము ఎఱ్ఱగానుండెను. అతనికంఠస్వరము దుందుభిధ్వనివలె గంభీరమైనది, అతనిశరీరముపైగల రోమములు, మీసములు, కేశములు సింహపుజూలువలె మృదువుగానుండెను. అతడు శుభలక్షణసంపన్నుడు, దివ్యాభరణభూషితుడు, గిరిశిఖరమువలె ఉన్నతమైనవాడు, మదించిన పెద్దపులివలె భయంకరుడు, సూర్యతేజస్సుతో ప్రకాశించుచున్నవాడు, ప్రజ్వలించుచున్న అగ్నిశిఖలవలె వెలుగొందుచున్నవాడు, అట్టి దివ్యపురుషుడు విపులమై, ఆశ్చర్యమును గొలుపు ఒక బంగారు పాత్రను స్వయముగా

దివ్యపాయససంపూర్ణాం పాత్రీం పత్నీమివ ప్రియామ్।
ప్రగృహ్య విపులాం దోర్భ్యాం స్వయం మాయామయీ మివ। 15

సమవేక్ష్యాబ్రవీద్వాక్యమ్ ఇదం దశరథం నృపమ్।
ప్రాజాపత్యం నరం విద్ధి మామిహాభ్యాగతం నృప। 16

తత: పరం తదా రాజా ప్రత్యువాచ కృతాంజలి:।
భగవన్ స్వాగతం తేఽస్తు కిమహం కరవాణి తే। 17

అథో పునరిదం వాక్యం ప్రాజాపత్యో నరోఽబ్రవీత్।
రాజన్నర్చయతా దేవాన్ అద్య ప్రాప్తమ్ ఇదం త్వయా। 18

ఇదం తు నృపశార్దూల పాయసం దేవనిర్మితమ్।
ప్రజాకరం గృహాణ త్వం ధన్యమ్ ఆరోగ్యవర్ధనమ్। 19

భార్యాణామ్ అనురూపాణామ్ అశ్నీతేతి ప్రయచ్ఛ వై।
తాసు త్వం ప్రాప్స్యసే పుత్రాన్ యదర్థం యజసే నృప। 20

తథేతి నృపతి: ప్రీత: శిరసా ప్రతిగృహ్య తామ్।
పాత్రీం దేవాన్నసంపూర్ణాం దేవదత్తాం హిరణ్మయీమ్। 21

అభివాద్య చ తద్భూతమ్ అద్భుతం ప్రియదర్శనమ్।
ముదా పరమయా యుక్త: చకారాభిప్రదక్షిణమ్। 22

తతో దశరథ: ప్రాప్య పాయసం దేవనిర్మితమ్।
బభూవ పరమప్రీత: ప్రాప్య విత్తమివాధన:। 23

తతస్తదద్భుతప్రఖ్యం భూతం పరమభాస్వరమ్।
సంవర్తయిత్వా తత్కర్మ తత్రైవాంతరధీయత। 24

హర్షరశ్మిభిరుద్ద్యోతం తస్యాంత:పురమాబభౌ।
శారదస్యాభిరామస్య చంద్రస్యేవ నభోఽంశుభి:। 25

సోఽంత:పురం ప్రవిశ్యైవ కౌసల్యామ్ ఇదమబ్రవీత్।
పాయసం ప్రతిగృహ్ణీష్వ పుత్రీయం త్విదమాత్మన:। 26

కౌసల్యాయై నరపతి: పాయసార్ధం దదౌ తదా।
అర్ధాదర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిప:। 27

కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థకారణాత్।
ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమమ్। 28

ప్రియపత్నినివలె ప్రేమతో రెండుచేతులతో పట్టుకొనియుండెను. వెండిమూతగల ఆ బంగారుపాత్ర దివ్యమైన పాయసముతో నిండియుండెను. (11-15)

ఆ దివ్యపురుషుడు దశరథమహారాజుతో "ఓ రాజా! నేను బ్రహ్మదేవుడు పంపగా ఇచ్చటికి వచ్చితిని" - అని నుడివెను. తదనంతరము ఆ రాజు అంజలి ఘటించి "ఓ మహాత్మా! నీకు స్వాగతము. నా కర్తవ్యమును దెలుపుము" అని పలికెను.(16-17)

పిమ్మట బ్రహ్మపంపున వచ్చిన ఆ దివ్యపురుషుడు మఱల ఇట్లు వచించెను. "ఓ రాజా! అశ్వమేధయాగము, పుత్రకామేష్టి అను వాటిద్వారా నీవు దేవతలను సంతుష్టులను గావించితివి. వారిఅనుగ్రహముతో ఇది లభించినది. ఓనరేంద్రా! ఇది దివ్యమైన పాయసము, సంపత్కరము, ఆరోగ్యమును వృద్ధి చేయునది, అంతేగాదు, ఇది సంతానమును ప్రసాదించును, దీనిని స్వీకరింపుము. ఈ పాయసమును నీ ప్రియపత్నులకిచ్చి, భుజింపవలసినదిగా వచింపుము. దీనిని సేవించుటవలన యజ్ఞ ఫలముగా నీ భార్యలకు పుత్రసంతానము కలుగును."(18-20)

అనంతరము రాజు 'అట్లే' అని పలికి, పరమప్రీతుడై, దివ్య పాయసముతో నిండి, దేవదత్తమైన ఆ బంగారు పాత్రను వినమ్రుడై గ్రహించెను. అద్భుతముగా దర్శనీయుడైయున్న ఆ దివ్యపురుషునకు పరమానందముతో ప్రదక్షిణనమస్కారములనొనర్చెను. (21-22)

దశరథమహారాజు దేవతలు అనుగ్రహించిన ఆ దివ్య పాయసమునుపొంది, నిర్ధనుడు ఒక నిధిని పొందినట్లుగా మహానందభరితుడాయెను. (23)

పాయసప్రదానకార్యమును ముగించుకొని, అద్భుతాకారముతో దివ్యతేజస్సుతో విరాజిల్లుచున్న ఆ మహాపురుషుడు వెంటనే అంతర్ధానమాయెను. (24)

సంతానదాయకమైన దివ్యపాయసము లభించుటవలన అంత:పురస్త్రీలందఱును మిక్కిలి సంతోషముతో ప్రసన్న ముఖకాంతులతో, శరత్కాలమునందు ఆహ్లాదకరమైన చంద్రకిరణములతో ప్రకాశించు ఆకాశమువలె తేజరిల్లిరి.(25)

దశరథుడు అంత:పురమున ప్రవేశించి, కౌసల్య మొదలగు రాణులతో "మనకు పుత్రులను ప్రసాదించు ఈ పాయసమును స్వీకరింపుడు" అని నుడివెను. (26)

ఆ మహారాజు కౌసల్యాదేవికి అమృతతుల్యమగు ఆ పాయసములో సగభాగమును ఇచ్చెను - మిగిలిన సగములో అర్ధభాగమును (1/4) సుమిత్రాదేవికి ఇచ్చెను. మిగిలిన పావు (1/4) భాగములో సగభాగమును (1/8) కైకేయికి ఒసగెను-

అనుచింత్య సుమిత్రాయై పునరేవ మహీపతిః ।
ఏవం తాసాం దదౌ రాజా భార్యాణాం పాయసం పృథక్ । 29

మిగిలిన పరక (1/8) భాగమును మరల సుమిత్రకు ఇచ్చెను- ఈ విధముగా పుత్రసంతానప్రాప్తికై పాయసమును ముగ్గురు రాణులకు విడివిడిగా పంచెను. (27-29)

తాస్త్వేతత్ పాయసం ప్రాప్య నరేంద్రస్యోత్తమాః స్త్రియః ।
సమ్మానం మేనిరే సర్వాః ప్రహర్షోదితచేతసః । 30

ఆ ముగ్గురు రాణులును దశరథునినుండి పాయసమును స్వీకరించి, అది తమకు జరిగిన సమ్మానమని (మహాభాగ్యముగా) భావించి, సంతోషముతో పొంగిపోయిరి. (30)

తతస్తు తాః ప్రాశ్య తదుత్తమస్త్రియో
మహీపతేః ఉత్తమపాయసం పృథక్ ।
హుతాశనాదిత్యసమానతేజసో౽
చిరేణ గర్భాన్ ప్రతిపేదిరే తదా । 31

తతస్తు రాజా ప్రసమీక్ష్య తాః స్త్రియః
ప్రరూఢగర్భాః ప్రతిలబ్ధమానసః ।
బభూవ హృష్ట స్త్రిదివే యథా హరిః
సురేంద్ర సిద్ధర్షి గణాభిపూజితః । 32

పిమ్మట దశరథమహారాజుయొక్క ప్రియపత్నులు ముగ్గురును ఆ దివ్యపాయసమును ఎవరిభాగమును వారు భుజించి, అగ్నివలె, సూర్యునివలె తేజోమూర్తులై విరాజిల్లిరి. అచిరకాలముననే వారు గర్భవతులైరి. తదనంతరము దశరథుడు గర్భవతులైన తనభార్యలను జూచి, హృష్టచిత్తుడై, స్వర్గమునందు ఇంద్రాదిదేవతలచే, సిద్ధులచే, ఋషిగణములచే పూజింపబడిన విష్ణువువలె సంతోషపడెను. (31-32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షోడశస్సర్గః (16)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదునాఱవసర్గము సమాప్తము

— * * * —